క్లుప్తంగా

వాహనాల వేలం.. రూ.2,56,296 ఆదాయం



వేలంపాటలో పాల్గొన్న జిల్లా ఎక్సైజ్ అధికారి లక్ష్మానాయక్, పోలీసులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో సీజ్ చేసిన 13 ద్విచక్ర వాహనాలకు శనివారం పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్‌లో జిల్లా ఎక్సైజ్ అధికారి ఆర్.లక్ష్మానాయక్ ఆధ్వర్యంలో బహిరంగ వేలంపాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ.. ఈ వేలంలో రూ.2,56,296 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ వాహనాల వేలంలో ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ 1.15 లక్షలకు గాను 122 శాతం అధికంగా లభించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మునగాల ఎస్ఐగా ప్రవీణ్‌కుమార్



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఐ ప్రవీణ్‌కుమార్

మునగాల : మునగాల పోలీస్‌స్టేషన్ నూతన ఎస్ఐగా బి.ప్రవీణ్‌కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ విధులు నిర్వర్తించిన బైరెడ్డి అంజిరెడ్డి అనారోగ్య కారణంతో సెలవుపై వెళ్లగా ప్రవీణ్‌కుమార్ షీటీమ్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా బరాఖత్‌గూడెం శివారులో గల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలకోవకు చెందిన గ్రామపెద్దలు కొంపెల్లి వీరబాబు, గన్నా నరసింహారావు, పనస విజయ్‌కుమార్, కుదుముల వీరయ్య తదితరులు ఆయనను సన్మానించి అభినందనలు తెలిపారు.

నడిగూడెం తహసీల్దార్‌గా సరిత బాధ్యతలు స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న తహసీల్దార్ సరిత

నడిగూడెం : నడిగూడెం తహసీల్దార్‌గా వి.సరిత శనివారం బాధ్యతలు చేపట్టారు. నాగర్‌కర్నూలు జిల్లా ఆమ్రాబాద్ నుంచి ఆమె బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న హేమామాలిని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో విధుల్లో చేరారు. ఈ సందర్భంగా సరిత మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



ప్రభుత్వ ఆసుపత్రిలో మొక్క నాటుతున్న ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డి, తదితరులు

గరిడేపల్లి : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డి కోరారు. శనివారం గరిడేపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వన మహోత్సవంలో ఆయన పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వన మహోత్సవాన్ని ఉపాధి సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ మౌలానా, ఎంఈఓ చత్రునాయక్, వైద్యాధికారి నరేష్, పంచాయతీ కార్యదర్శి సురేష్, ఫీల్డ్ అసిస్టెంట్ మేకపోతుల సరితగౌడ్, పవన్, రావుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా గీత పనివారల సంఘం సమావేశం

చిలుకూరు : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ధర్మభిక్షం భవన్‌లో ఆదివారం జిల్లా గీత పనివారల సంఘం నిర్మాణ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండా కోటయ్య తెలిపారు. శనివారం చిలుకూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం గీత వృత్తిని పరిరక్షించాలని కోరారు. సమావేశానికి గీత సంఘం బాధ్యులు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

'చలో హైదరాబాద్'ను విజయవంతం చేయాలి

మునగాల : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 30న నిర్వహించ తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బచ్చలకూరి స్వరాజ్యం కోరారు. శనివారం మునగాల మండలంలోని నేలమర్రిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామపంచాయతీ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నాయకులు మామిడి వెంకన్న, రాంపంగు సుందరయ్య, బచ్చలకూరి నాగేంద్ర, పార్వతి, యంగలి పాపయ్య పాల్గొన్నారు.

అధ్వానంగా కాలువ కట్ట

చిలుకూరు : మండల పరిధిలోని రెడ్లకుంట మేజర్ (ఆర్‌కే మేజర్) కాలువ కట్ట అధ్వానంగా తయారయింది. కాలువ కట్టపై గుంతలు పడి వర్షానికి నీరు నిలుస్తోంది. దీంతో పొలాలకు వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా ఈ కట్టపై చిలుకూరు నుంచి ఆర్లెగూడెం, రామ్‌నగర్ గ్రామాలకు రాకపోకలు సాగించే ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. ముఖ్యంగా 8ఆర్, 5ఆర్ మైనర్ కాల్వలు, ఆర్లెగూడెం సమీపంలో ఆర్‌కే మేజర్ కాల్వ కట్ట గుంతలమయంగా మారింది. అయితే ప్రతి ఏడాది కాలువ కట్టకు మరమ్మతులు చేపడుతున్నప్పటికీ నాసిరకంగా చేస్తుండడంతో వర్షాకాలంలో అధ్వానంగా తయారవడం పరిపాటిగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆర్‌కే మేజర్ కాలువ కట్టకు మరమ్మతులు చేపట్టి ఇబ్బందులు లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.



గుంతలమయంగా రెడ్లకుంట మేజర్ కాలువ కట్ట



5ఆర్ మైనర్ కాల్వ పరిధిలో ఆర్‌కే కాల్వ ఇలా..

29న ఏఐటీయూసీ జిల్లా సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్

హుజూర్‌నగర్ : కోదాడలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఈ నెల 29న జరిగే ఏఐటీయూసీ జిల్లా విస్తృత కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్ కోరారు. శనివారం హుజూర్‌నగర్‌లోని హనుమాల లింగయ్య భవన్‌లో నిర్వహించిన ఏఐటీయూసీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో అన్ని ప్రజా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొనాలని కోరారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులందరికీ ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. వేలి ముద్ర పద్ధతిని తొలగించి పాత పద్ధతిలోనే భవన నిర్మాణ కార్మికులకు కార్డులు ఇవ్వాలని కోరారు. 55 ఏళ్లు నిండిన ప్రతి భవన నిర్మాణ కార్మికుడికి రూ.6 వేల పింఛను ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాములు మాట్లాడుతూ అర్హులైన పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆరోగ్య శ్రీ, రేషన్ కార్డులు, ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, వారిలో కార్మికులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జట్టి ప్రసాద్, నాయకులు దగ్గుపాటి సత్యానందం, బెజ్జం రమేష్, బాణావత్ సైదులు, జక్కుల మల్లయ్య, ముడుసు పాపారావు, ములకలపల్లి నరసింహారావు, జక్కుల రమణ, బెజ్జం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

చిల్లేపల్లి చెక్‌పోస్టు వద్ద నాకాబందీ



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

నేరేడుచర్ల : జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ఆదేశాల మేరకు సూర్యాపేట- నల్లగొండ జిల్లాల సరిహద్దు అయిన నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి చెక్‌పోస్టు వద్ద శనివారం నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్‌నాయక్ ఆధ్వర్యంలో నాకాబందీ నిర్వహించారు. ఇటీవల ఈ రెండు జిల్లాల్లో గంజాయి, నిషేధిత గుట్కాలు, పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తూ పెద్ద ఎత్తున పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అక్రమ రవాణాను అరికట్టేందుకు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వాహనాల ధ్రువ పత్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సైదులు, పోలీస్ సిబ్బంది విష్ణు, వెంకట్, గోవింద్, శ్రీను తదితరులు ఉన్నారు.

భోజ్యాతండాలో తీజ్ వేడుకలు



తీజ్ వేడుకల్లో పాల్గొన్న గిరిజనులు

మఠంపల్లి : మండలంలోని భోజ్యాతండాలో గిరిజనులు తీజ్ వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గిరిజన యువతులు తండా పెద్ద ఇంట్లో ఉన్న గోధుమనారు బుట్టలను తలపై ఎత్తుకుని దేవాలయం వద్దకు చేరుకుని ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం వాగులు, బావులలో గోధుమనారు బుట్టలకు జలాభిషేకం గావించారు. ఈ కార్యక్రమంలో తండాపెద్దలు, శ్రీనునాయక్, పాండియా నాయక్, నాగు, బోస్తు, దేవి, సైదా, చంద్రా, మోత్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



సుల్తాన్‌పూర్‌తండాలోని డ్రెయినేజీలో పూడిక తీయిస్తున్న పంచాయతీ కార్యదర్శి, వైద్య సిబ్బంది

మఠంపల్లి : మండలంలోని సుల్తాన్‌పూర్‌తండా, మట్టపల్లి, రామచంద్రాపురంతండా, పెదవీడు తదితర గ్రామాల్లో శనివారం పారిశుద్ధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. ఈ సందర్భంగా మురికి కాలువల్లో పేరుకుపోయిన పూడిక తీయించారు. దోమల నివారణకు ఫాగింగ్ చేపడుతున్నట్లు పలువురు కార్యదర్శులు తెలిపారు. సీజనల్ వ్యాధులు రాకుండా పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మద్దుల వెంకటేశ్వర్లు, దేవరకొండ చంద్రశేఖర్, రాజు, లక్ష్మణ్‌నాయక్, ఆశా వలంటీర్లు, పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

● గోరింటాకు పండుగ



ఆషాఢమాసం సందర్భంగా గరిడేపల్లి మండల కేంద్రంలోని గుండాలమ్మ ఆలయం వద్ద గుండాలమిట్టకు చెందిన మహిళలు శనివారం గోరింటాకు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఒకరికొకరు గోరింటాకు పెట్టుకున్నారు. – గరిడేపల్లి

తప్పటడుగులు వేస్తే భవిష్యత్ అంధకారం



మాట్లాడుతున్న ఇంపాక్ట్ సంస్థ ట్రైనర్ సత్యనారాయణ

నేరేడుచర్ల : విద్యార్థి దశలోనే తప్పటడుగులు వేస్తే భవిష్యత్ అంధకారం అవుతుందని ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సంస్థ ట్రైనర్ మామిడి సత్యనారాయణ అన్నారు. శనివారం నేరేడుచర్ల మండలంలోని పెంచికల్‌దిన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షణ సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యార్థి దశలోనే ఒక లక్ష్యాన్ని ఎంచుకొని..లక్ష్య సాధనకు శిక్షణ పొందినప్పుడే విజయం సాధిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎల్. శ్రీనివాస్, ఉపాధ్యాయులు విద్యార్థులు ఉన్నారు.

మానవ అక్రమ రవాణాను అడ్డుకోవాలి

మోతె : మానవ అక్రమ రవాణాను అడ్డుకోవాలని మోతె ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మోతెలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ సౌజన్యంతో యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులను బెదిరించడం, బలవంతం చేయడం, అపహరించడం, మోసం చేయడం, అక్రమ రవాణా కోసం ప్రేరేపించడం చేస్తే చట్టప్రకారం నేరమన్నారు. ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటే టోల్ ఫ్రీ నంబర్లు 100, 1098, 112 సంప్రదించాలన్నారు. ఎయిడ్ సంస్థ జిల్లా బాధ్యుడు సోమన్న, జీసీడీఓ పూలన్, తహసీల్దార్ సంఘమిత్ర, ప్రిన్సిపాల్ ధనలక్ష్మి, అంజలి, పార్వతి పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలి



అబ్దుల్ కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ట్రస్ట్‌ల సభ్యులు

కోదాడరూరల్ : శాస్త్ర సాంకేతిక రంగంలో అబ్దుల్ కలాం తీసుకొచ్చిన ఆవిష్కరణలను యువత ఆదర్శంగా తీసుకోవాలని పలు ట్రస్ట్‌ల సభ్యులు అన్నారు. శనివారం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా కోదాడలోని గాంధీపార్క్‌లో ఆయన విగ్రహానికి విజయీభవ, స్వర్ణభారతీ ట్రస్ట్, ఇరుకుళ్ల ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప శాస్త్రజ్ఞుడు కలాం అని అన్నారు. ఆయన రాష్ట్రపతిగా దేశాభివృద్ధికి ఎంతో కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో గాదంశెట్టి శ్రీనివాసరావు, చెన్నకేశవరావు, యాద సుధాకర్‌రావు, సాంబశివరావు, జగనీ ప్రసాద్, రాయపుడి వెంకటనారాయణ, వెంపటి వెంకటేశ్వరరావు, రవి తదితరులు ఉన్నారు.

అంకితభావంతో పనిచేస్తే సమాజంలో గుర్తింపు



అనంతగిరి : బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నాయకులు



చిలుకూరు : బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ, తోటి ఉపాధ్యాయులు

అనంతగిరి : అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులకు సమాజంలో గుర్తింపు ఉంటుందని పీఏసీఎస్ చైర్మన్ నెల్లూరు ఉషారాణి అన్నారు. అనంతగిరి మండలం గోండ్రియాల ప్రాథమిక పాఠశాలలో సుదీర్ఘకాలం పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు హమీద్, మల్లికార్జున్, రావెల శ్రీనివాసరావులకు శనివారం పాఠశాలలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఉపాధ్యాయులు సమసమాజ నిర్మాతలు అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నెల్లూరి లీలావతి బాబురావు, పీఏసీఎస్ డైరెక్టర్ మాగి యాకోబు, హెచ్‌ఎం సుధాకర్, ఉపాధ్యాయులు నాంచారయ్య, బాబు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు బదిలీలు సహజం

చిలుకూరు : ప్రభుత్వ ఉపాధ్యాయులకు బదిలీలు సహజమని, అంకిత భావంతో ఎక్కడ పనిచేసినా మంచి గుర్తింపు ఉంటుందని ఎంఈఓ సలీమ్ షరీఫ్ అన్నారు. శనివారం చిలుకూరు మండలంలోని రామ్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తూ పదోన్నతిపై వెళ్లిన ప్రధానోపాధ్యాయుడు కొండా వెంకయ్య, ఉపాధ్యాయుడు దొంగరి వీరబాబును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు వెంకయ్య, వీరబాబులు పాఠశాల అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు గుండు ఆదినారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాయిలి శ్రీహరి, ఉపాధ్యాయులు చలిగంటి వెంకటలక్ష్మి, పాయిలి శ్రీను, రాజారాం, అన్వర్, తేజ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ కృషి



చిలుకూరులోని జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉపాధ్యాయులకు సభ్యత్వాలు అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

చిలుకూరు : ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) కృషి చేస్తుందని సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓరుగంటి నాగేశ్వరరావు, బంధం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం చిలుకూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు ఎస్టీయూ సభ్యత్వాలను అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత కరెంట్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల బాధ్యులు సురగాని లింగయ్య, అంకిరెడ్డి నాగిరెడ్డి, కొండా రామాంజినేయులు, కొండా వీరబాబు, ముదిగొండ సురేష్, పుట్టపాక నరసింహారావు, అనంత రామారావు, గురువారెడ్డి, పవన్‌కుమార్, శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుడికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బుచ్చిపాపయ్య

మునగాల : మండలంలోని తాడువాయి గ్రామానికి చెందిన జిల్లేపల్లి కిరణ్ ఇటీవల ప్రమాదవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందాడు. దీంతో అతినికి ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.16,500 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును శనివారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొలిశెట్టి బుచ్చిపాపయ్య అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి జిల్లేపల్లి వెంకటేశ్వర్లు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జిల్లేపల్లి శ్రీనివాస్, సీపీఎం గ్రామ అధ్యక్షుడు జిల్లేపల్లి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు మాతంగి విజయ్, జిల్లేపల్లి బాలకృష్ణ, మాతంగి విజయ్, మాతంగి అంజి, కోట వెంకన్న, పార్టీ యూత్ నాయకులు జిల్లేపల్లి వినయ్, కోట ప్రవీణ్, జి.వెంకటేశ్, అలేటి గురుప్రసాద్, కోట పాపయ్య, కోట వెంకన్న, జిల్లేపల్లి శ్రీను, మాతంగి శోభన్‌బాబు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో పునర్జన్మ

అనంతగిరి : కార్డియో పల్మనరీ రీససిటేషన్ (సీపీఆర్)తో గుండెపోటుకు గురైన వ్యక్తికి పునర్జన్మ ఇవ్వవచ్చని, ఈ విధానాన్ని ప్రతిఒక్కరూ నేర్చుకోవాలని వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీప్రసన్న తెలిపారు. సీపీఆర్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మండలంలోని త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాటాడారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ రత్న మేరీ, ఫార్మసిస్టు శైలజ, ల్యాబ్ టెక్నీషియన్ మహేష్, సూపర్‌వైజర్ వెంకట నరసమ్మ, ఆరోగ్య కార్యకర్తలు ఇందిరా, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో బోనాల సంబురం



బోనాల వేడుకలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

గరిడేపల్లి : మండలంలోని కీతవారిగూడెం గ్రామంలో గల సన్‌రైజ్ స్కూల్‌లో శనివారం బోనాల వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు బోనాలు ఎత్తుకుని వచ్చి దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. విద్యార్థి యోగి సంజయ్ పోతరాజు వేషధారణలో, విద్యార్థినులు బోనాలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ప్రిన్సిపాల్ అల్తాఫ్ హుస్సేన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

హుజూర్‌నగర్ : ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ పడిదేల రవి అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లోని టౌన్‌హాల్‌లో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 9న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగే మహాధర్నా, ప్రదర్శనలో మాదిగ, ఉప కులస్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్ నాయకులు ఎం.అంబేద్కర్, ఆర్.విజయ భాస్కర్, కె.జానయ్య, ఎం.ముక్కంటి, పి.కాటయ్య, ఎం.వెంకటేశ్వర్లు, ఆర్.రాము, కె.రవీందర్ పాల్గొన్నారు.

బడ్జెట్‌లో మహిళలకు ప్రాధాన్యం ఇవ్వని ప్రభుత్వం



మాట్లాడుతున్న ఉస్తెల సృజన

హుజూర్‌నగర్ (చింతలపాలెం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్లో మహిళలకు ప్రాధాన్యత ఇవ్వలేదని భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం చింతలపాలెంలో మహిళా సమాఖ్య మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వాలు బడ్జెట్‌లో మహిళల సంక్షేమంపై వివక్ష చూపాయని ఆరోపించారు. కార్మిక లోకానికి, చిన్న పరిశ్రమలకు కూడా న్యాయం జరగలేదన్నారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై నమోదవుతున్న కేసులను ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ చేసి ఆరు నెలల్లో తీర్పునివ్వాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ఉపతల కోటమ్మ, నాయకురాళ్లు వాడకొప్పుల లక్ష్మి, తేరోజమ్మ, భీమిశెట్టి పద్మ, వీరమ్మ, అచ్చమ్మ, బుజ్జమ్మ, రంగమ్మ, సీపీఐ మండల కార్యదర్శి రవి పాల్గొన్నారు.

ముసురుకాలం.. పరిశుభ్రత ముఖ్యం

- గ్రామాల్లో సీజనల్ వ్యాధులు విజృంభణ
- పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచిస్తున్న వైద్య సిబ్బంది



రామలక్ష్మీపురంలో రోడ్డుపై నిలిచిన మురుగు నీరు (ఫైల్)



కాపుగల్లులో నిల్వ నీటిని పారబోస్తున్న వైద్య సిబ్బంది

కోదాడరూరల్ : వర్షాకాలం ప్రారంభమైంది. వర్షాలతో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారై పలు గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. ఇప్పటికే కోదాడ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో సీజనల్ వ్యాధులు విజృంభించడంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి జ్వరపీడితులకు వైద్యం అందించి నియంత్రణలోకి తీసుకొచ్చారు. సీజనల్‌గా వచ్చే కలరా, మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి వ్యాధులు బారిన పడకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య సిబ్బంది సూచిస్తున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోవడం, కలుషితమైన నీటిని తాగడం, దోమలు, ఈగలు వ్యాప్తితో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతాయని చెబుతున్నారు. పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు తగు జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధుల బారి నుంచి బయట పడవచ్చని సూచిస్తున్నారు. ముఖ్యంగా వీధులు, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, తద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని సిబ్బంది చెబుతున్నారు. దోమల కారణంగా మలేరియా, టైఫాయిడ్, డెంగీ వ్యాధులు విజృంభిస్తుంటాయని.. ఈ వ్యాధులు సోకిన వెంటనే ప్రజలకు ఆందోళనకు గురికాకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని చెబుతున్నారు. ప్రతి జ్వరం మలేరియా, డెంగీలు కాదని వీటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యసిబ్బంది సూచిస్తున్నారు. సీజనల్ బారిన పడకుండా గ్రామాల్లో వైద్యారోగ్య శాఖతో పాటు పంచాయతీరాజ్ శాఖ అధికారులు సమన్వయంతో ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కలుషిత నీటితో ముప్పు..

కలుషిత నీటితో అతిసార, కలరా, టైఫాయిడ్, పచ్చ కామెర్లు వ్యాపిస్తాయి. దోమలతో మలేరియా, టైఫాయిడ్, డెంగీ, చికెన్ గున్యా, మెదడువాపు వ్యాధులు సంభవిస్తాయి. వీటిని అరికట్టడానికి స్వచ్ఛమైన మంచి నీటి తాగాలి. కాచి చల్లార్చిన నీటిని తాగాలని వైద్యులు సూచిస్తున్నారు. గ్రామాల్లో నీటిని ట్యాంకులను నెలకొకసారి క్లోరిన్‌ను కలిపి శుభ్రం చేయాలి. డ్రెయినేజీలను శుభ్రం చేస్తూ మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలి.

పారిశుద్ధ్య కార్మికులను అప్రమత్తం చేశాం



వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లోని వీధుల్లో వర్షపు, మురుగు నీరు నిల్వకుండా ఇప్పటికే పారిశుద్ధ్య కార్మికులను అప్రమత్తం చేశాం. గ్రామాల్లో డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశాం. మంచి నీటి ట్యాంకులను క్లోరిన్‌తో శుభ్రం చేయాలని చెప్పాం. ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలి.

– పాండురంగన్న, ఎంపీఓ, కోదాడ